సాక్షి కామారెడ్డి

బుధవారం । 3 । మే । 2023



నష్ట పరిహారం ఇవ్వాలి

పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 50 వేల పరిహారం ఇవ్వాలని మాజీ మంత్రి షబ్బీర్ అలీ డిమాండ్ చేశారు.

- 9లో ▸



వర్షాలతో అపార నష్టం

అకాల వర్షాలతో రైతులకు అపార నష్టం వాటిల్లిందని, వారిని సర్కారు ఆదుకుంటుందని ఎమ్మెల్యే హన్మంత్‌సింధే పేర్కొన్నారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.8 /18.8

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. సాయంత్రం అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

రైతులు ధైర్యంగా ఉండాలి



భిక్కనూరు: ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అడిషనల్ కలెక్టర్ చంద్రమోహన్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన భిక్కనూరు, జంగంపల్లిలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలతో పాటు అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతులు ధైర్యాన్ని కోల్పోవద్దన్నారు. పంట నష్టం వివరాలను అధికారులు నమోదు చేస్తున్నారన్నారు. తడిసిన ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఆయన వెంట ఎంపీపీ గాలిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ భూమయ్య, తహసీల్దార్ ప్రేమ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ కిష్టయ్య తదితరులు ఉన్నారు.

ఓపెన్ ఇంటర్ తెలుగు మీడియం పరీక్ష రద్దు

ఎల్లారెడ్డి: ఓపెన్ ఇంటర్ తెలుగు మీడియం పరీక్షను రద్దు చేశారని ఓపెన్ ఇంటర్ పరీక్షా కేంద్రం సూపరింటెండెంట్ శివప్రసాద్ తెలిపారు. మంగళవారం నిర్వహించాల్సిన ఓపెన్ ఇంటర్ తెలుగు మీడియం పరీక్షకు సంబంధించి ఇంగ్లిష్ మీడియం ప్రశ్నాపత్రం రావడంతో ఉన్నతాధికారులు గమనించి పరీక్షను రద్దు చేశారని పేర్కొన్నారు. రద్దైన పరీక్షను ఈనెల 13న నిర్వహిస్తామని తెలిపారు.

'విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి'

కామారెడ్డి టౌన్: విద్యుత్ విషయంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో ఎస్‌ఈ రమేశ్‌బాబు సూచించారు. విద్యుత్ ప్రమాద నివారణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షంలో తడిచిన విద్యుత్ స్తంభాలనుగాని, స్టే వైర్, సపోర్ట్ వైర్, తడిచిన విద్యుత్ ఉపకరణాలనుగాని తాకవద్దన్నారు. ఓల్టేజ్ హెచ్చుతగ్గులున్నా, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద శబ్దం వస్తున్నా విద్యుత్ శాఖకు సమాచారం ఇవ్వాలన్నారు. వ్యవసాయ క్షేత్రాలు, ఇళ్లలో అతుకులు లేని సర్వీస్ వైర్‌ను మాత్రమే వాడాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ

తాడ్వాయి: ఎర్రాపహాడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్ తనిఖీ చేశారు. వైద్యులతో మాట్లాడారు. ఇప్పటివరకు ఎంతమంది మహిళలకు వైద్య పరీక్షలు చేశారని అడిగారు. 193 మందికి వైద్య పరీక్షలు చేశామని, అందులో 56 మందిని మెరుగైన వైద్య సేవల కోసం కామారెడ్డికి పంపించామని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఆరోగ్య మహిళలో భాగంగా ప్రతి మంగళవారం మహిళలకు 8 రకాల పరీక్షలను ఉచితంగా చేస్తున్నామన్నారు. పరీక్ష ఫలితాల ఆధారంగా అవసరమైన మందులను అందిస్తామన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, మండల వైద్యాధికారి నజీర, హెచ్‌ఈవో నారాయణ, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది ఉన్నారు.

పంచాయతీలకు తాళం వేసిన సర్పంచ్‌లు

- ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శులు రావొద్దని సూచన
- జేపీఎస్‌ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



ఎల్లారెడ్డిరూరల్: సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీ పాలకవర్గాలు మద్దతుగా నిలుస్తున్నాయి. డిమాండ్ల సాధన కోసం జేపీఎస్‌లు సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో ప్రభుత్వం వారి స్థానంలో సీనియర్ పంచాయతీ కార్యదర్శులు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించింది. వారు మంగళవారం విధుల కు రాగా.. ఎల్లారెడ్డి మండలం రుద్రారం, రేపల్లెవాడ, సబ్దల్‌పూర్ గ్రామాల సర్పంచులు సత్తయ్య, సాయిరాం, లక్ష్మి అడ్డుకున్నారు. గ్రామ పంచాయతీ భవనాలకు తాళాలు వేశారు. గతంలో విధులు నిర్వర్తించిన వారినే విధులకు హాజరయ్యేలా చూడాలని, వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. దీంతో ఇన్‌చార్జీలు వెనుదిరిగారు.

గుమ్మల్లో ధాన్యం కుప్పల చుట్టూ నిలిచిన వర్షం నీరు



కౌలు రైతు కుదేలు!

మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా తయారయ్యింది కౌలు రైతుల పరిస్థితి. యాసంగిలో తెగుళ్లతో సగం పంట నష్టపోయిన రైతన్న.. చివరలో రోజూ కురుస్తున్న వర్షాలతో నిండామునిగాడు. ఆరుగాలం కష్టం వర్షార్పణం కావడంతో అప్పులే మిగిలాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

- తెగుళ్లతో సగం పంట నష్టం..
- వడగండ్ల వానతో నిండా మునిగిన రైతన్న
- వడ్లు తడిసిపోయి ఇబ్బందులు
- అప్పులే మిగిలాయంటున్న అన్నదాతలు

సాక్షి, కామారెడ్డి: అకాల వర్షాలతో కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన రైతులు.. పంట చేతికందే సమయంలో కురిసిన వడగండ్లు, వానలతో తీవ్రంగా నష్టపోయారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో భూమిలేని రైతులు చాలామంది కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తున్నారు. ఎకరాకు ఆరు నుంచి ఏడు క్వింటాళ్ల ధాన్యం కౌలు కింద ఇస్తున్నారు. ఈ యాసంగి సీజన్‌లో జిల్లాలో 3,500 మంది కౌలు రైతులు దాదాపు 40 వేల ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేశారు. రెక్కల కష్టంతోపాటు పంటల సాగులో భాగంగా దుక్కులు దున్నడం, విత్తనాలు, నాట్లు, ఎరువులు, కలుపులు తీయడం, తెగుళ్ల సోకినపుడు క్రిమిసంహారక మందులు పిచికారీ చేయడం, చివరకు వరి కోసి ధాన్యాన్ని కేంద్రాలకు తరలించే వరకు ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చు చేశారు. పంట దిగుబడి కనీసం 20 క్వింటాళ్లు వచ్చినా పెట్టుబడులు పోను ఎంతోకొంత మిగులుతుందన్న ఆశతో ఉన్న రైతులను అకాల వర్షాలు నిండాముంచాయి. కొన్నిచోట్ల కోతకొచ్చిన వరి దెబ్బతినడంతో కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారు. వడ్ల గింజలన్నీ రాలిపోయాయి. గడ్డి కోసినా లాభం లేదు. వరి కోసిన రైతులు వడ్లను కొనుగోలు కేంద్రాలకు తరలించారు. అయితే వర్షాలతో వడ్లన్నీ తడిసిపోయి మొలకలు వస్తుండడంతో ఆవేదన చెందుతున్నారు. పెట్టుబడులు కూడా తిరిగివచ్చే పరిస్థితులు లేవని పేర్కొంటున్నారు. భూ యజమానికి కౌలు ఎలా ఇవ్వాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకునేదెవరు?

రాష్ట్రంలో కౌలు రైతులను రైతులుగా గుర్తించకపోవడంతో పంటలు దెబ్బతిన్న సమయంలో వారిని పట్టించుకునే వారు కరువయ్యారు. పంటల సాగుకు పెట్టుబడి సాయంగా ప్రభుత్వం అందిస్తున్న రైతుబంధు భూయజమాని ఖాతాలోకి వెళ్తోంది. పంట దెబ్బతిన్నప్పుడు ప్రభుత్వం ఏమైనా సాయం అందిస్తే.. కౌలు రైతుకు నష్ట పరిహారం అందే అవకాశాలు లేవు. కౌలు రైతులను ప్రభుత్వాలు గుర్తించకపోవడంతో వారికి ఎలాంటి మేలు జరగడం లేదు. భూములు కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తున్న సమయంలో ఏదైనా ప్రమాదం జరిగి ప్రాణాలు కోల్పోయిన పరిస్థితుల్లోనూ బీమా అందడం లేదు. ప్రభుత్వం తమనూ ఆదుకోవాలని కౌలు రైతులు కోరుతున్నారు.

మళ్లీ దంచికొట్టింది..

జిల్లాలో వానలు దంచికొడుతున్నాయి. సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం ఉదయం వరకు జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. కామారెడ్డిలో 51 మి.మీ., రామారెడ్డిలో 50.3 మి.మీ., సదాశివనగర్‌లో 41 మి.మీ., నాగిరెడ్డిపేటలో 39.3 మి.మీ., సర్వాపూర్‌లో 28.3 మి.మీ., బొమ్మన్‌దేవ్‌పల్లిలో 28.3 మి.మీ., మాచారెడ్డిలో 27.5 మి.మీ., దోమకొండలో 20.3 మి.మీ., రాజంపేటలో 18.8 మి.మీ. వర్షపాతం నమోదయ్యింది. మిగతా మండలాల్లోనూ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి.

పెట్టుబడి మీదవడ్డది



పదిహేను ఎకరాలు కౌలుకు తీసుకుని వరి వేసిన. ఎకరానికి ఏడు క్వింటాళ్ల కౌలు ఇవ్వాలి. ఎకరాకు 20 క్వింటాళ్ల దాకా దిగుబడి వస్తుందని అనుకున్న. పంటకు మూడుసార్లు రోగాలు వచ్చినయి. రోగాలనుంచి కాపాడుకునేందుకు మస్తు ఖర్సయ్యింది. పంట కోసి కేంద్రానికి తీసుకవచ్చిన. వానలకు వడ్లు నానిపోయి ముక్కిపోతున్నయి. లాగోడికి తెచ్చిన అప్పులు మీదవడ్డట్టే. వ్యవసాయం ఏం లాభం లేదు.

– మిడత సాయిలు, కౌలు రైతు, మహ్మద్‌నగర్

వానకు నాని నష్టపోతున్నం..



ఐదు బిగాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేసిన. పెట్టుబడి ఖర్చులు అడ్డగోలుగా పెరిగినయి. తెగుళ్లతోని చానా దెబ్బ తిన్నది. పంట చేతికి వచ్చిందని కోసి కేంద్రానికి తీసుకువచ్చిన. తెచ్చిన నుంచి వాన ఒక్కతీర్గ తగిలింది. వారం రోజుల సంది రోజూ వడ్లు నానుతున్నయి. లొకెలొస్తున్నయి. వానలతోని పరేషాన్ అయితున్నం. ఎట్ల బతుకుడో ఏమో..

– గజ్జెల నాగరాజు, కౌలు రైతు, బూర్గుల్

దినాం నానుడే..!



షేర్‌ఖాన్‌పల్లిలో మొలకలు వచ్చిన జొన్న పంట



అక్కాపూర్‌లో నేలకొరిగిన వరి పంట

- వదలని వరుణుడు
- ఆరబోసి కుప్ప చేసేలోపు మళ్లీ వాన
- మొలకలతో పాటు రంగుమారుతున్న వడ్లు

సాక్షి, కామారెడ్డి: వరి రైతుపై వరుణుడు పగబట్టాడు. అకాల వర్షాలతో తీవ్ర నష్టం కలుగజేశాడు. పది రోజులుగా నిత్యం కురుస్తున్న అకాల వర్షాలతో రైతన్న తీవ్రంగా నష్టపోయాడు. జిల్లాలో యాసంగి సీజన్‌లో 2.30 లక్షల ఎకరాల్లో వరి సాగయ్యింది. ధాన్యం కొనుగోళ్ల కోసం జిల్లా లో 347 కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభు త్వం నిర్ణయించింది. ఇప్పటివరకు 313 కేంద్రాలను ప్రారంభించినా 170 కేంద్రాల్లోనే కొనుగో ళ్లు జరుగుతున్నాయి. మంగళవారం నాటికి జిల్లాలో 5,703 మంది రైతుల వద్ద నుంచి 45,483 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. కాగా కొనుగోలు కేంద్రాల వద్ద లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కుప్పలు ఉన్నాయి.

జిల్లాలో చాలాచోట్ల మూడు వారాలక్రితమే వరికోతలు ప్రారంభమయ్యాయి. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ఆరబెడుతున్నారు. అయితే చాలాచోట్ల కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడం, కొనుగోళ్లు ప్రారంభమైనా తూకాలు వేగంగా సాగకపోవడం రైతుల పాలిట శాపంగా మారింది. హమాలీల కొరత, ట్రాన్స్‌పోర్టు వాహనాల సమస్యలతో కొనుగోళ్లు ఆలస్యం అవుతున్నాయి. ఇదే సమయంలో వానలు దంచికొడుతుండడంతో రైతుల పరిస్థితి దయనీయంగా తయారైంది.



భవానీపేటలో వరికుప్పలచుట్టూ చేరిన నీరు

టార్పాలిన్లు కప్పినా..

జిల్లాలో పది రోజులుగా కురుస్తున్న వర్షాలతో వడ్లు నానిపోయాయి. లింగంపేట, నిజాంసాగర్, ఎల్లారెడ్డి, మాచారెడ్డి, దోమకొండ, బీబీపేట, సదాశివనగర్, రామారెడ్డి, తాడ్వాయి, రాజంపేట, నాగిరెడ్డిపేట, పిట్లం, బిచ్కుంద, బాన్సువాడ, గాంధారి, కామారెడ్డి, మద్నూర్ తదితర మండలాల్లో వర్షాలు రైతులను ఇబ్బంది పెడుతున్నాయి. వడ్లు నానకుండా రైతులు ఎన్నో ఏర్పాట్లు చేశారు. టార్పాలిన్లను అద్దెకు తీసుకువచ్చి కప్పారు. ఎంత నిండుగా కప్పినా భారీ వర్షాలతో కిందిభాగాన వడ్లన్నీ నానిపోయి ముక్కిపోతున్నాయి. ఆరబెట్టడానికీ వరుణుడు అవకాశం ఇవ్వడం లేదు. కొన్నిచోట్ల ఎండ వచ్చిందని రైతులు ధాన్యం కుప్పలపై ఉన్న కవర్లను తీసి రోడ్లపై ఆరబెడుతున్నారు. సాయంత్రం కుప్ప చేస్తుండగానే ఒక్కసారిగా వర్షం వస్తుండడంతో మళ్లీ నానుతున్నాయి. వాన మొగులైతుందంటే చాలు రైతుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. గుబులు రేగుతోంది. వాన రాకముందే కుప్పలు చేసి కవర్లు కప్పే ప్రయత్నం చేస్తున్నారు. అయినప్పటికీ వరదలతో ధాన్యం నానిపోతోంది. కొందరు రైతులతో వారం రోజులుగా కవర్లు విప్పడం లేదు. ఆరుగాలం శ్రమతో పండిన పంట కళ్ల ముందే ముక్కిపోయి మొలకలు వస్తుండడంతో రైతులు కంటతడి పెడుతున్నారు. రెక్కల కష్టం ఏమోగానీ కనీసం పెట్టుబడులు కూడా చేతికి వస్తాయో లేదో తెలియని పరిస్థితుల్లో ఆవేదన చెందుతున్నారు. మంచిగ ఉన్న ధాన్యాన్ని తీసుకోవడానికే మిల్లర్లు కడ్తా పేరుతో దోచుకుంటున్నారని, ముక్కిపోయి, మొలకలొచ్చిన వడ్లను తీసుకోవడానికి ఎన్ని పేచీలు పెడతారోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చొరవ చూపి తడిసిన ధాన్యాన్ని కాంటా వేయించి దుకోవాలని రైతులు కోరుతున్నారు.

అర్ధరాత్రి స్పీకర్ పర్యటన



- కాంటా పెట్టించి ధాన్యం తరలింపు

నస్రుల్లాబాద్ (బీర్కూర్): ఉమ్మడి బీర్కూర్ మండలంలో వరి ధాన్యం తడిసి పోవడం, కాంటాలు ఆలస్యం అవుతుండడంతో రైతులు ఆందోళన చెందడం చూసిన స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి సోమవారం అర్ధరాత్రి 11.30 గంటలకు పర్యటించారు. తన వెంట జిల్లా అధికారులను తీసుకుని వెళ్లి మరీ కాంటాలు పెట్టించారు. కల్లాల్లోనే కూర్చొని లారీల్లో లోడ్ చేయించి మిల్లులకు తరలించారు. బీర్కూర్ మండలంలోని వీరాపూర్, దామరంచ, చించెల్లి, నస్రుల్లాబాద్ మండలంలోని మిర్జాపూర్‌లలో స్పీకర్ పర్యటించారు. ఆయన వెంట అడిషనల్ కలెక్టర్ చంద్రమోహన్, ఆర్డీవో రాజాగౌడ్, స్థానిక నాయకులు ఉన్నారు.

ప్రతి గింజను కొనుగోలు చేస్తాం

- రైతులు ఆందోళన చెందొద్దు
- కలెక్టర్ జితేష్ వి పాటిల్



బాన్సువాడ కొనుగోలు కేంద్రంలో మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

బాన్సువాడ: రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. మంగళవారం బాన్సువాడలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అన్నారు. దొడ్డు రకం ధాన్యానికి కొంకి రోగం వచ్చిందని, అందుకే ధాన్యంలో పొల్లు ఉంటుందని పేర్కొన్నారు. ఈ విషయం తన దృష్టికి వచ్చిందని, రైస్‌మిల్లర్లతో మాట్లాడి ఇబ్బందులు లేకుండా చూస్తామని పేర్కొన్నారు. రైతులు ధాన్యం తడవకుండా జాగ్రత్తగా చూసుకోవాలని అన్నారు. టార్పాలిన్లు లేవని రైతులు కలెక్టర్‌తో పేర్కొన్నారు. టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సహకార సిబ్బందికి సూచించారు. ఆయన వెంట జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు అంజిరెడ్డి, ఆర్డీవో రాజాగౌడ్, తహసీల్దార్ గంగాధర్, సహకార సంఘం కార్యదర్శి నారాయణరెడ్డి తదితరులున్నారు.

రెండో విడత గొర్రెల పంపిణీపై సమీక్ష

కామారెడ్డి క్రైం: గొర్రెల పంపిణీ పథకం లబ్ధిదారుల నుంచి మూడు రోజుల్లోపు ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో రెండో వి డత గొర్రెల పంపిణీపై పశు వైద్యులతో సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా రెండో విడత లబ్ధిదారుల వివరాలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో ముందుకు వెళ్లాలని సూచించారు. సమావేశంలో జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి సింహారావు, పశు వైద్యులు పాల్గొన్నారు.

విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి

కామారెడ్డి క్రైం: విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం విద్యుత్ భద్రత, పొదుపు సూచనలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాల నుంచి రక్షించుకోవడానికి భద్రత సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఎస్‌ఈ రమేష్ బాబు, డీఈ సాలియా నాయక్, వెంకటరంగయ్య, ఏడీఈలు జవహర్ నాయక్, మల్లేష్, ఏఈలు ప్రభాకర్, ధర్మారెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

బాల్యవివాహాలను అరికట్టాలి

కామారెడ్డి క్రైం: బాల్యవివాహాలను అరికట్టాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం బాల రక్షా భవన్ కన్వర్జేషన్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు గ్రామాల్లో అనాథ పిల్లల వివరాలను సేకరించాలన్నారు. వారికి ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో అనాథల కోసం సీట్లు ఉంటాయన్నారు. ఎవరైనా పిల్లలతో భిక్షాటన చేయిస్తే చట్టారీత్యా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పదో తరగతి పూర్తి చేసిన అనాథ బాలికలు పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలు పొందవచ్చన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ అన్యోన్య, డీసీపీవో స్రవంతి, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

'రైతుల గోస పట్టని ప్రభుత్వం'

కామారెడ్డి టౌన్: అకాల వర్షాలతో పంటలు నష్టపోయి రైతులు కన్నీరు పెడుతున్నా ప్రభుత్వానికి పట్టడం లేదని బీజేపీ కామారెడ్డి అసెంబ్లీ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి విమర్శించారు. పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జిల్లా కేంద్రంలోని బల్దియా కార్యాలయం వద్ద బీజేపీ ఆధ్వర్యంలో రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారులతో సమీక్షలు నిర్వహించి, రైతులను ఆదుకునే మంత్రి, అధికారులు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై ప్రభుత్వం స్పందించకపోతే గురువారం జిల్లా కేంద్రంలో రైతు భరోసా ర్యాలీ, కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కొనుగోళ్లను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షులు చారి, నాయకులు గంగారెడ్డి, రమేష్‌రెడ్డి, రాజేష్, ఆనందరావు, ఆంజనేయులు, ప్రవీణ్, లక్ష్మీపతి, రాజు, రమేష్, శ్రీధర్, రవీందర్‌రెడ్డి, తిరుమల్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

5,023 మందికి కంటి పరీక్షలు

కామారెడ్డి టౌన్: జిల్లాలో కంటి వెలుగు లో 5,023 మందికి పరీక్షలు చేశారు. 519 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. జిల్లాలో ఇప్పటివరకు జిల్లాలో 356 గ్రామ పంచాయతీలు, 65 మున్సిపల్ వార్డులలో కంటి వెలుగు కార్యక్రమం పూర్తయ్యిందని వైద్యాధికారులు తెలిపారు. ప్రస్తుతం 39 పంచాయతీలు, 5 మున్సిపల్ వార్డులలో కార్యక్రమం కొనసాగుతోందన్నారు. ఇప్పటివరకు 3,62,546 మందికి కంటి పరీక్షలు చేసి, 54,394 మందికి కంటి అద్దాలను అందించామని తెలిపారు.

'ఆర్థికంగా ఎదిగేలా చూడాలి'

బాన్సువాడ: రైతులు, మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదిగేందుకు దోహదపడే పథకాలను రూపొందించాలని కలెక్టర్ పాటిల్ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. మంగళవారం బాన్సువాడలోని స్పీకర్ నివాసంలో ఆయన పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కలిశారు. ఫిష్ పాండ్‌ల గురించి ల్యాప్‌ట్యాప్‌లో వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కూరగాయల సాగు, చేపల పెంపకానికి రైతులు, డ్వాక్రా మహిళలకు గ్రూపులవారీగా బ్యాంకుల ద్వారా రుణ సాయం అందిస్తే బాగుంటుందన్నారు. మహిళా సంఘాల సభ్యులతో పప్పులు, పసుపు, మిర్చి తదితర నిత్యవసర వస్తువులను తయారు చేయించడం ద్వారా ఒకవైపు మహిళలకు మేలు జరుగుతుందని, అదేవిధంగా ప్రభుత్వ వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన వస్తువులను ప్రభుత్వం పక్షాన తయారు చేసి అందించినట్లు అవుతుందని పేర్కొన్నారు. ఫిష్ పాండ్‌ల పథకానికి మొదటగా బాన్సువాడ మండలం పోచారం, నస్రుల్లాబాద్ మండలం అంకోల్ క్యాంప్, బీర్కూర్ మండలం బైరాపూర్ గ్రామాలను ఎంపిక చేయాలని సూచించారు. ఆయన వెంట డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి ఉన్నారు.



స్పీకర్‌తో మాట్లాడుతున్న కలెక్టర్

క్లుప్తంగా

ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి



కామారెడ్డి క్రైం : అంకితభావంతో పనిచేసిన ఉద్యోగులు ప్రజల మన్ననలను పొందుతారని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. బదిలీపై వెళ్తున్న ఇన్‌చార్జి జిల్లా పశువైద్యాధికారి భరత్ కుమార్‌కు వీడ్కోలు సమావేశాన్ని కామారెడ్డి కలెక్టరేట్‌లో మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. టీజీవో ఆధ్వర్యంలో భరత్ కుమార్‌కు కలెక్టర్ సన్మానం చేసి జ్ఞాపిక అందజేశారు. కొత్తగా వచ్చిన జిల్లా పశువైద్యాధికారి సింహారావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీజీవో జిల్లా అధ్యక్షుడు దేవేందర్, ప్రధాన కార్యదర్శి సాయి రెడ్డి, ప్రతినిధులు భూమయ్య, పోచయ్య, జుగల్ కిషోర్, పశు వైద్య అధికారులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుడు మృతి



హన్మంత్‌రెడ్డి(ఫైల్)

కమ్మర్‌పల్లి : కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్ గ్రామానికి చెందిన స్వాతంత్య్ర సమరయోధుడు ముత్యాల హన్మంత్‌రెడ్డి(97) మంగళవారం మరణించారు. హన్మంత్‌రెడ్డి నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో నిజామాబాద్‌కు చెందిన జె.హన్మంత్, కామారెడ్డి వెంకట్‌రెడ్డిలతో కలిసి పోరాడారు. జిల్లా జైలులో, చంచల్‌గూడ జైలులో శిక్ష కూడా అనుభవించారు. స్వాతంత్య్ర వచ్చిన అనంతరం 25 ఏళ్ల హాసాకొత్తూర్ గ్రామానికి సర్పంచ్‌గా సేవలందించారు. ఆయనకు ముగ్గురు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు.

బహుమతి వచ్చిందంటూ ఆన్‌లైన్‌లో మోసం

కామారెడ్డి క్రైం : మీ ఫోన్ నెంబర్‌కు బహుమతి గెలుచుకున్నారని నమ్మించిన ఆన్‌లైన్ మోసగాళ్లు ఓ వ్యక్తికి రూ. 4 వేలకు టోకరా వేశారు. జిల్లా కేంద్రంలోని అజాంపుర కాలనీకి చెందిన సయ్యద్ తాహెర్‌కు ఈనెల 19న ఫేస్‌బుక్‌లో 'చోటే మియా, బడే మియా జంజం ఎల్రక్టానిక్స్' అనే యాప్ నుంచి గిఫ్ట్ వచ్చినట్లు మెసేజ్ వచ్చింది. వాట్సాప్ ద్వారా మెసేజ్‌ను ఓపెన్ చేయాలని సూచించారు. వారు చెప్పినట్లుగా చేయడంతో తాహెర్ అకౌంట్‌లో నుంచి రూ. 4 వేలు కట్ అయ్యాయి. మోసం జరిగినట్లు గుర్తించి మంగళవారం పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్‌హెచ్‌ఓ నరేష్ తెలిపారు.

జూన్ 1 నుంచి డిగ్రీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు జూన్ 1 నుంచి ప్రారంభమవుతాయని కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం.అరుణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ రెండవ, నాల్గవ, ఆరవ రెగ్యులర్ థియరీ, ఒకటవ, మూడవ, ఐదవ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షల షెడ్యూల్ పూర్తి వివరాలను త్వరలో యూనివర్సిటీ వెబ్‌సైట్ www.telanganauniversity.ac.inలో పొందుపరుస్తామని కంట్రోలర్ తెలిపారు.

ఎట్టకేలకు పెరిగిన వేతనాలు

- ఒక్కో జీపీ కార్మికుడికి నెలకు రూ. వెయ్యి పెంచుతూ ఉత్తర్వులు
- పెంచిన వేతన భారం పంచాయతీలపైనే..
- జిల్లాలో 2,720 మంది కార్మికులకు పెరిగిన వేతనాలు



హైదరాబాద్‌లోని పంచాయతీ కమిషనర్ కార్యాలయం వద్ద కార్మికుల నిరసన (ఫైల్)

మోర్తాడ్(బాల్కొండ): గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న మల్టీపర్పస్ కార్మికులకు ప్రతి నెలా రూ. వెయ్యి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. గ్రామ పంచాయతీ కారోబార్లు, కార్మికులకు వేతనాలు పెంచాలని ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్మికుల సంఘాలు రాష్ట్ర ప్రభుత్వానికి గత నెలలో వినతి పత్రాలను అందించాయి. తమ డిమాండ్లను పరిష్కరించక పోతే ఈనెల 5వ తేదీ నుంచి సమ్మె చేపడుతామని నోటీసులు ఇచ్చారు. పంచాయతీ కార్మికుల ఆందోళన నేపథ్యంలోనే వేతనం పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటి వరకు పంచాయతీ సిబ్బందికి నెలకు రూ.8,500 వేతనం చెల్లిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం ఇక నుంచి రూ. 9,500ల చొప్పున వేతనం చెల్లించనున్నారు. పెంచిన వేతనాన్ని చెల్లించే బాధ్యత పంచాయతీలపైనే ప్రభుత్వం భారం మోపింది. ప్రభుత్వం ప్రత్యేక గ్రాంటు ఏమీ ఇవ్వకపోవడంతో సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోంది. పంచాయతీల ఆదాయం అంతంత మాత్రంగానే ఉండగా పెంచిన వేతన భారం ను ప్రభుత్వం తీసుకోకపోవడంపై నిరసన వ్యక్తమైతుంది. పంచాయతీల్లో పని చేస్తున్న కారోబార్లు, ఎలక్ట్రీషన్, డ్రైవర్లు, పంప్ ఆపరేటర్లు, పారిశుద్ధ్య కార్మికులు అందరిని మల్టీపర్పస్ కార్మికులుగానే ప్రభుత్వం గుర్తించింది.

జీపీలకు ప్రతినెలా..

జిల్లాలో 530 గ్రామ పంచాయతీలకు గాను 2,720 మంది కార్మికులు వివిధ రకాల పనులు చేస్తున్నారు. వీరికి ప్రతి నెలా పంచాయతీలు రూ. 2,31,20,000 వేతనాలు చెల్లిస్తున్నాయి. ఇప్పుడు పెంచిన వేతనంతో పంచాయతీలపై నెలకు రూ. 27.20లక్షల అదనపు భారం ఏర్పడనుంది. ఆర్థిక సంఘం నిధుల నుంచి గతంలో జీతాల కోసం వినియోగించేవారు. కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం మార్గదర్శకాలను మార్చడంతో వేతనాల కోసం జీపీలు పన్నుల ఆదాయం, స్టేట్ ఫైనాన్స్ కార్పోరేషన్ నిధులను వినియోగించేవి. ట్రెజరీ కార్యాలయాల ద్వారా వేతనాలను చెల్లించడానికి చెక్కులు పంపిస్తుండటం ఫ్రీజింగ్ కారణంగా చెక్కులు సకాలంలో చెల్లకపోవడంతో వేతనాలు చేతికందడంలో జాప్యం కలుగుతుంది.

పంచాయతీల కార్మికుల వేతనాల భారంను ప్రభుత్వం మోస్తేనే పంచాయతీలకు ఇబ్బంది తప్పుతుందనే వాదన వినిపిస్తుంది. అంతేకాకుండా ప్రభుత్వ నిధుల నుంచి వేతనా ల చెల్లిస్తే ప్రతి నెలా సకాలంలోనే తమ ఖాతాల్లో జీ తాలు జమైతాయని పంచాయతీ సిబ్బంది చెబుతున్నారు. పంచాయతీ కార్మికుల వేతనాలను ప్రభు త్వం పెంచినా క్షేత్ర స్థాయిలో మాత్రం సంతృప్తి లే కపోవడం గమనించదగ్గ విషయం అని చెప్పవచ్చు.

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి

- వీవోఏల జిల్లా అధ్యక్షుడు పోశెట్టి డిమాండ్
- పాత కలెక్టరేట్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న వీవోఏలు

సుభాష్‌నగర్ : తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ పరిధిలో పనిచేస్తున్న వీవోఏల సమస్యలు వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఐకేపీ వీవోఏ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పోశెట్టి డిమాండ్ చేశారు. వీవోఏల సమ్మెలో భాగంగా మంగళవారం కలెక్టరేట్ ఎదుట ప్లకార్డులతో నిరసన తెలియజేశారు. అనంతరం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు పాత కలెక్టరేట్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోశెట్టి మాట్లాడుతూ 11 రోజులుగా వీవోఏలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. కనీస గౌరవ వేతనం రూ.18వేలు అమల్జేయాలని, రూ. 10 లక్షల సాధారణ బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలన్నారు. గౌరవ వేతనం డీఆర్‌డీఏ అకౌంట్ నుంచి నేరుగా వీవోఏల ఖాతాల్లో జమ చేయాలని, జీవో నెంబర్ 58ని సవరిస్తూ మూడేళ్లకొకసారి పునఃరుద్ధరణ చేయాలని డిమాండ్‌చేశారు. అర్హత కలిగిన వారికి సీసీలుగా ప్రమోషన్లు ఇవ్వాలని, జాబ్ చార్ట్ డిక్లరేషన్ ప్రకటించాలని కోరారు. కరోనా సమయంలో చనిపోయిన వీవోఏ కుటుంబాలకు రూ. 10 లక్షల ఆర్థికసాయం చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ నాయక్, సుదర్శన్, నయీమ్, అరుణ, మురళి, సరళ, దీప, నాగరాజు, మంజులత, సరిత, సువర్ణ, సుమారు 500 మంది వీవోఏలు పాల్గొన్నారు.

బీఈడీ పరీక్షలకు 66 మంది గైర్హాజరు

తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన బీఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షకు 1,061మంది విద్యార్థులకు గానూ 995మంది హాజరు కాగా 66 మంది గైర్హాజరైనట్లు కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం.అరుణ తెలిపారు. పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

కుక్కల దాడిలో గొర్రెల మృతి



మాచారెడ్డి : మండలంలోని పాల్వంచలో మంగళవారం తెల్లవారుజామున కుక్కల దాడిలో పది గొర్రెలు మృత్యువాత పడ్డాయి. తుప్పటి ఎల్లయ్య కొట్టంలో చొరబడిన కుక్కలు గొర్రెలపై దాడికి దిగాయి. పది గొర్రెలను కొరికి చంపాయి. దీంతో రూ. లక్ష నష్టం వాటిల్లినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నారు.

22 నుంచి తెయూలో ప్రాక్టికల్ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి) : తెయూ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల్లో వివిధ సెమిస్టర్లలో ఈనెల 22 నుంచి 30 వరకు నిర్వహిస్తారని కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం.అరుణ మంగళవారం తెలిపారు. 2,4,6వ సెమిస్టర్ రెగ్యులర్, 1, 3, 5వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్, ఏఈసీసీ, ఇంటర్నల్, స్కిల్ ఎన్‌హాన్స్‌మెంట్ కోర్సు (ఎస్ఈసీ) ప్రాక్టికల్, వైవావోస్ ఉంటాయన్నారు.

జోరుగా కల్లు అక్రమ దందా

- కల్లు దుకాణం సీజ్ చేసినా దర్జాగా అమ్మకాలు
- విక్రయదారుడిపై కేసు
- 12 మంది లైసెన్స్‌లు రద్దు
- హెచ్‌ఆర్‌సీని ఆశ్రయించిన గౌడకులస్తులు

ఖలీల్‌వాడి : ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్‌లో కల్లు అక్రమ దందా జోరుగా సాగుతుంది. గతంలో ఈ ప్రాంతంలోని కల్లుబట్టీలో ఆల్ప్రాజోలం కలిపి కల్లును విక్రయిస్తున్నట్లు సమాచారం రాగా ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపారు. పరీక్షల్లోనూ కల్లులో ఆల్ప్రాజోలం ఉన్నట్లు నిర్ధారణ కావడంతో కల్లు డిపో లైసెన్స్‌ను రద్దు చేశారు. అయితే మళ్లీ కల్లు డిపో తెరిచేందుకు కొందరు ప్రయత్నాలు చేయడంతో కల్లు బట్టీ తెరవొద్దని స్థానికంగా పలువురు గౌడకులస్తులు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు కూడా కల్లులో ప్రమాదకరమైన ఆల్ప్రాజోలం కలిపినట్లుగా నిర్ధారణ అయ్యాక లైసెన్స్ ఎలా పునరుద్ధరిస్తారని పేర్కొంది. అయితే అదే ప్రాంతంలో దర్జాగా కల్లును అక్రమంగా సదరు వ్యక్తి అమ్ముతున్నప్పటికీ స్థానిక ఎక్సైజ్ అధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

స్థానిక ఎక్సైజ్ అధికారుల నిర్లక్ష్యం..

హైకోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ అక్రమంగా కల్లు అమ్మకాలు సాగిస్తున్న సతీష్‌గౌడ్‌ను మూడు రోజుల క్రితం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేసి 26 లీటర్ల కల్లును స్వాధీనం చేసుకున్నారు. స్థానికంగా కల్లుదందా జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం శోచనీయం.

కల్లుగీత రాకున్నా..

జాన్కంపేట్‌లో పలువురు కల్లుగీత రాకున్న గాని గీతకార్మికులుగా లైసెన్స్‌లు పొందినట్లు ఆరోపణలున్నాయి. దీంతో గ్రామంలో 12 లైసెన్స్‌లు రద్దు చేశారు. దీంతో గ్రామంలోని పలువురు గౌడకులస్తులు హెచ్‌ఆర్‌సీని ఆశ్రయించారు. వీడియోగ్రాఫిక్ ట్యాపింగ్ టెస్ట్ నిర్వహించాలని హెచ్‌ఆర్‌సీ ఆదేశాలు ఇచ్చింది. కాని ఎక్సైజ్ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేకుండా పోయాయి. గతంలో అధికారులు సంతకాలు చేస్తూ లైసెన్స్‌లు ఇచ్చేవారు. ప్రస్తుం వీడియో ట్యాపింగ్ టెస్ట్ చేసి అనంతరం ఎక్సైజ్ అధికారులు కలెక్టర్ అనుమతి కూడా తీసుకోవాల్సి ఉంటుంది.

ధర్మాసనం విచారణ..

జానకంపేట్ కల్లుబట్టీలో ఆల్ప్రాజోలం ఉందని నిర్ధారణ కావడంతో హైకోర్టు జయవర్ధన్ గౌడ్, సతీష్‌గౌడ్‌లతోపాటు మరో 10 మంది లైసెన్స్‌లను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయినప్పటికీ మళ్లీ తమకు లైసెన్స్ పునరుద్ధరించాలని వారు హైకోర్టును ఆశ్రయించారు. అల్ప్రాజోలం ఉన్నట్లు తేలినందున పునరుద్ధరణ కుదరదని హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్వల్‌భుయాన్, తుకారాంజీల నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. అయినప్పటికీ సదరు సతీష్‌గౌడ్ తిరిగి అక్రమంగా కల్లు అమ్మడం చర్చనీయాంశంగా మారింది.

కల్లుదుకాణాన్ని సీజ్ చేశాం

జాన్కంపేట్ కల్లుదుకాణం హైకోర్టు ఆదేశాల మేరకు రద్దు చేశాం. 12 మంది లైసెన్స్‌లను రద్దు అయ్యాయి. కల్తీకల్లు అమ్మకాలపై దాడులు చేసి సతీష్‌గౌడ్‌ను అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశాం. వీడియో ట్యాపింగ్ టెస్ట్ ద్వారా లెసెన్స్‌లు ఇస్తున్నాం. కలెక్టర్ సంబంధిత ఫైల్ పంపిస్తాం. హెచ్ఆర్‌సీ ఆదేశాలు నా దృష్టికి రాలేదు. వస్తే పరిశీలిస్తాను. – మల్లారెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్, నిజామాబాద్

'సాక్షి' మాక్ ఎంసెట్‌కు విశేష స్పందన





నగరంలోని నిశిత డిగ్రీ కళాశాలలో మాక్ ఎంసెట్ ఆన్‌లైన్ పరీక్ష రాస్తున్న విద్యార్థినులు

సాక్షి స్పందన

నిజామాబాద్ అర్బన్ : 'సాక్షి' దినపత్రిక ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని నిషిత డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మాక్ ఎంసెట్‌కు విశేష స్పందన లభించింది. దీనికి జిల్లాలోని వివిధ ప్రాంతల నుంచి విద్యార్థులు తరలివచ్చారు. 'సాక్షి' ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఎంసెట్ ఇంజినీరింగ్, మెడిసిన్ విభాగంలో ప్రోత్సాహాన్ని అందించేందుకు ఈ మాక్‌ఎంసెట్ టెస్ట్ నిర్వహిస్తూ వస్తోంది. దీనివల్ల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతోంది. ప్రతి ఏడాదిలాగే ఈసారి కూడా ఇంజినీరింగ్, మెడిసిన్ విభాగాల్లో విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చేందుకు ఆన్‌లైన్ మాక్ టెస్టులు నిర్వహించింది. జిల్లాలోని విద్యార్థులు టెస్టులకు రిజిస్ట్రేషన్ చేసుకొని ఆన్‌లైన్ పరీక్షకు హాజరయ్యారు. ఉదయం10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష జరిగింది. నిపుణులైన విద్యావేత్తలచే రూపొందించబడిన మాక్ ఎంసెట్ టెస్ట్ పేపర్లు తయారు చేయబడ్డాయి. 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మాక్ ఎంసెట్ పరీక్షను ఎదుర్కొన్న విద్యార్థులు ప్రభుత్వం నిర్వహించే పరీక్షల్లో తేలికగా మార్కులు సాధించగలుగుతున్నారు, 'సాక్షి' నిర్వహించిన మాక్ ఎంసెట్ టెస్ట్‌కు ఎఆర్ కళాశాల యాజమాన్యం సహకారం అందించింది. ఈ పరీక్ష నిర్వహణలో సాక్షి బ్రాంచ్ మేనేజర్ పల్లె మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న భారతీయ కిసాన్ సంఘ్ ప్రతినిధులు

కామారెడ్డి క్రైం : భారతీయ కిసాన్ సంఘ్ కామారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ కార్యాలయానికి తరలివచ్చి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు వినతి పత్రం అందజేశారు. ఆరుగాలం కష్టపడి నోటికాడికి వచ్చిన పంట అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు రైతు పంటను సర్వే చేయించి నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50 వేలు చెల్లించాలని, మొలకెత్తిన ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

ఇప్పటికైనా స్పందించి ప్రభుత్వము తక్షణమే పంటల బీమాలు చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ డిమాండ్ డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ కిసాన్‌సంఘ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

సైకిల్, బైక్ ఢీ : ఒకరి మృతి



దాసు మృతదేహం

ఖలీల్‌వాడి : సైకిల్‌ను బైక్‌తో అతివేగంగా ఢీకొనడంతో తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ ఎర్రమైగల్ల దాసు (45) మృతి చెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట్ జిల్లా చేర్యాల మండలంలోని బండపల్లికి చెందిన దాస్ నగరంలో మేస్త్రి వృత్తి చేసుకున్నట్లు తెలిపారు. మార్చ్ 30న రాత్రి 8 గంటలకు సైకిల్‌పై గాయత్రినగర్ రోడ్డు దాటుతుండగా బైక్ అతివేగంగా వచ్చి ఢీకొనడంతో దాసుకు తీవ్ర గాయాలు కాగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారని తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



మేకల రాజు (ఫైల్)

డిచ్‌పల్లి : మండలంలోని నడిపల్లి గ్రామానికి చెందిన మేకల రాజేశ్వర్ (42) మంగళవారం సాయంత్రం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు డిచ్‌పల్లి ఎస్సై కే.గణేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం రాజేశ్వర్ కొంత కాలం డ్రైవర్‌గా, ప్రస్తుతం వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. మద్యానికి అలవాటు పడటంతో కుటుంబంలో కలహాలు రేగాయి. భార్య సావిత్రి, ఇద్దరు పిల్లలను తీసుకుని కొంత కాలం క్రితం పుట్టింటికి వెళ్లింది. దీంతో జీవితంపై విరక్తి చెందిన రాజు మంగళవారం మద్యం మత్తులో ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య సావిత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిప్పంటించుకొని మహిళ..

ఖలీల్‌వాడి : నగరంలోని 4వ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోటగల్లికి చెందిన అగ్గు లావణ్య(42) ఒంటికి నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అగ్గు లావణ్య మతిస్థిమితం సరిగా లేనందున కోటగల్లీ నుంచి తల్లిగారి ఇల్లయిన ఎల్లమ్మగుట్టలో ఉంటూ చికిత్స చేయించుకుంది. ఏప్రిల్ 30న రాత్రి 9 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో నైటీకి నిప్పంటించుకొని ఆత్మహత్యకు ప్రయత్నించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాఠశాలలో చోరీకి యత్నం

నవీపేట : మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో గుర్తు తెలియని దుండగులు చోరీకి యత్నించారని పాఠశాల హెచ్ఎం అరుణ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాఠశాల ప్రాంగణంలోని క్రీడా గది తలుపులు పగులగొట్టి ఆకతాయిలు చోరీకి పాల్పడ్డారన్నారు. గతంలో పలుమార్లు ఆకతాయిలు ఇలాగే విధ్వంసాలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. ఆకతాయిలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి ఐదేళ్ల జైలు

ఖలీల్‌వాడి : మధునాల దశా గౌడ్ అనే మృతి చెందడానికి కారణమైన కామే లాయక్‌కు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ నిజామాబాద్ సెషన్స్ జడ్జి సునీత కుంచాల మంగళవారం తీర్పు చెప్పారు. భీంగల్ మండలంలోని పురాణీపేట్ మార్గంలో ఉన్న సాధన హైస్కూల్ దగ్గర 21 మే, 2021 న దశా గౌడ్ హత్య చేయబడినట్లు భీంగల్ సీఐ ఆఫీస్ అధికారి శ్రీనాథ్ రెడ్డి నేర విచారణను పూర్తి చేసి కోర్టుకు వివరాలు సమర్పించారు. ముద్దాయి లాయక్ తన భార్యను, వరుసకు చెల్లెలైన మరొక స్త్రీ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన దశాగౌడ్‌ను కట్టెతో కొట్టి గాయపర్చగా వెళ్లిపోయాడు. కొద్దిసేపటి తర్వాత తిరిగొచ్చిన దశాగౌడ్ మళ్లీ అదే విధంగా అసభ్యకరంగా ప్రవర్తించడంతో రాయితో కొట్టి గాయపర్చారు. దీంతో దశాగౌడ్ బంధువులు ఆయనను జీజీహెచ్‌కు తరలించి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా మర్గమధ్యలో మృతి చెందాడు. దీంతో లాయక్‌పై నేరారోపణలు రుజువు కాగా ఐదేళ్ల కఠిన జైలుశిక్షతో పాటు రూ. 1,000 జరిమానా విధించారు. పోలీసుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవిరాజ్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

రాత్రిళ్లలో హోటల్ నిర్వహిస్తున్నాడని..

ఖలీల్‌వాడి : నగరంలోని ఒకటవ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రైల్వే స్టేషన్ దగ్గర వెల్‌కమ్ హోటల్ ఓనర్ రియాజ్‌కు 188 ఐపీసీ సెక్షన్ కింద రెండు రోజులు జైలు శిక్ష విధిస్తూ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఖదీర్ తీర్పు వెలువరించినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్ బాబు తెలిపారు. రియాజ్ ప్రతిరోజు రాత్రిళ్లలో వెల్‌కమ్ హోటల్ నడిపిస్తూ ఉంటాడని తెలిపారు.

తుఫాన్ వాహనం చోరీ



చోరీకి యత్నించిన వ్యక్తులు

భీమ్‌గల్ : వాహనాన్ని కొనడానికి వచ్చి వాహనాన్నే చోరీ చేసి ఎత్తుకెళ్లిన ఘటన భీమ్‌గల్ పట్టణ కేంద్రంలో జరిగింది. ఎస్సై రాజ్ భరత్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పిట్లం మండలం చిన్న కొడప్‌గల్‌కు చెందిన మధు, గంగారాం అనే వ్యక్తులు రెండు రోజుల క్రితం భీమ్‌గల్ వచ్చారు. పట్టణానికి చెందిన కవిత రాజుకు చెందిన టీఎస్06 యూబీ నంబర్ ఉన్న తుఫాన్ బండిని బేరం చేశారు. బేరం ఆడుతున్న సమయంలోనే వాహనం కీని దొంగలించారు. వాహనం కొనేందుకు మళ్లీ వస్తామని అక్కడి నుండి వెళ్లిపోయారు. వాహనం ఎత్తుకెళ్లేందుకు అర్ధ రాత్రి వరకు వేచి ఉండి వారి వద్ద ఉన్న కీతో వాహనాన్ని స్టార్ట్ చేసి ఎత్తుకెళ్లారు. వాహనంకు అమర్చిన జీపీఎస్‌ను గమనించిన వాహన ఓనర్ రాజు పోలీసులకు సమాచారం అందించాడు. కానిస్టేబుల్ సహాయంతో వాహనాన్ని వెంబడిస్తూ జీపీఎస్ ద్వారా బాన్సువాడ వద్ద నిలిపిన వాహనంతో పాటు చోరీ చేసిన వ్యక్తులను పట్టుకొని భీమ్‌గల్ పోలిస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజ్ భరత్ రెడ్డి తెలిపారు.

అతిగా మద్యం సేవించి ఒకరి మృతి



పవన్‌కుమార్ మృతదేహం

ఖలీల్‌వాడి : నగరంలోని నాలుగవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజారాణి వైన్స్ పర్మిట్‌రూమ్‌లో అతిగా మద్యం సేవించి పడిపోయి చికిత్స పొందుతూ వంగాల పవన్‌కుమార్(42) మృతి చెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. మృతుని భార్య వంగల సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కామారెడ్డి పట్టణంలో..

కామారెడ్డి క్రైం : అతిగా మద్యం సేవించి ఒకరు మృతి చెందిన ఘటన కామారెడ్డి లో మంగళవారం వెలుగు చూసింది వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని స్నేహపురి కాలనీకి చెందిన నర్సింగరావుకు ఇద్దరు కుమారులు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమారుడైన కిషోర్ కుమార్ (42) గతంలో వివాహం జరిగి ఐదేళ్ల క్రితం విడాకులు జరిగాయి. కొద్దిరోజుల నుంచి మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 30న సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. వెతికినా దొరకలేదు. మంగళవారం ఉదయం పూట రైల్వే ట్రాక్ సమీపంలో ఓ వ్యక్తి చనిపోయి ఉండగా పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి అనవాళ్ల ప్రకారం కుటుంబీకులకు సమాచారం ఇవ్వగా వారు చూసి కిషోర్‌కుమార్‌గా గుర్తించారు. అతిగా మద్యం సేవించి మృతి చెందినట్లు భావిస్తూ కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో నరేష్ తెలిపారు.

పురుగు మందు డబ్బాతో కలెక్టరేట్‌కు..

- భూమి కబ్జా చేశారని ఆందోళన
- సముదాయించిన అధికారులు



పురుగుమందు డబ్బాతో కామారెడ్డి కలెక్టరేట్‌లో బైఠాయించిన శేఖర్ కుటుంబీకులు

కామారెడ్డి క్రైం : తన భూమిని గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కబ్జా చేశారని, న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఓ వ్యక్తి కుటుంబం ఏకంగా పురుగు మందు డబ్బాతో కలెక్టరేట్‌కు వచ్చి ఆందోళనకు దిగారు. ఈ ఘటన కామారెడ్డి కలెక్టరేట్‌లో మంగళవారం కలకలం రేపింది. వివరాలిలా ఉన్నాయి. దోమకొండ మండలం చింతమాన్‌పల్లి గ్రామానికి చెందిన శేఖర్ అనే వ్యకిగత తన భార్య లత, ఇద్దరు పిల్లలు, తల్లి లింగవ్వలతో కలిసి కలెక్టరేట్‌కు వచ్చాడు. పురుగుమందు డబ్బాను ముందు పెట్టుకుని కార్యాలయం ఎదుట బైఠాయించాడు. గ్రామ శివారులోని తన 15 గుంటల భూమిని శివరాజ్, సంతోష్, మహిపాల్ అనే వ్యక్తులు కలిసి కబ్జా చేశారని ఆరోపించారు. న్యాయం చేయకపోతే ఇక్కడే పురుగు మందు తాగి చనిపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టరేట్ ఎస్సై ఉదయ్ శేఖర్, సిబ్బంది వారిని సముదాయిచి డబ్బాను లాక్కున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళి సమస్య పరిష్కారం అయ్యే చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం బాధితులు కలెక్టరేట్ పాలనాధికారి రవీందర్‌కు ఫిర్యాదు చేసి వెనుదిరిగారు.